ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.35 గం.
సహర్ : శనివారం ఉ : 4.45 గం.

ఎన్నికల్లో అక్రమాల నిరోధానికి 1950 నంబర్

దేశవ్యాప్తంగా ఛీఫ్ ఎలక్షన్ కమిషనరేట్ కార్యాలయానికి అనుసంధానం


మెదక్, ఏప్రిల్ 4: ఎన్నికల్లో అక్రమాల నిరోధానికి ఎన్నికల కమిషన్ టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1950 నంబర్‌కు దేశవ్యాప్తంగా ఏ ప్రాంతం నుంచయినా.. ఏ సమయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు, మద్యం, కానుకలుతో పాటు ఇతరత్రా ఓటర్లను లోబర్చుకునే కార్యక్రమాలు జరుగుతుంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుంది. ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు 15 వరకు గడువు ఇచ్చారు. ఓటరు జాబితాలో పేరు ఉందో.. లేదో, పోలింగ్ కేంద్రం చిరునామా వివరాలు తెలుసుకునేందుకు 1950 హెల్ప్‌లైన్ నంబరుకు డయల్ చేసి కనుక్కోవచ్చు. కోడ్ ఉల్లంఘనలు జరిగితే వెంటనే ఫోన్‌కాల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలవారీగా కలెక్టరేట్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. తద్వారా ఎన్నికల సిబ్బందికి నేరుగా సమాచారాన్ని చేరవేసేలా అనుసంధానించారు. ఫోన్‌కాల్ మొదట జిల్లా కేంద్రంలోని హెల్ప్‌డెస్క్‌కు వెళ్తుంది. వారు వెంటనే స్పందించక పోతే ప్రధాన ఎన్నికల కమిషనరేట్‌కి వెళ్తుంది. దీంతో, ఫిర్యాదులపై తప్పనిసరిగా స్పందన ఉంటుంది. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకూ మెదక్ జిల్లాలో 185 మంది ఈ టోల్‌ఫ్రీ నంబర్‌ద్వారా సందేహాలు నివృత్తి చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ బాలస్వామి కాల్‌సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు తెలుసుకుంటూ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజర101 మందికి నోటీసులు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైన 101 మంది అధికారులపై సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల విధులపై అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 1, 2 తేదీల్లో 4,180 మంది ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. శిక్షణా తరగతులకు గైర్హాజరైన వారికి కలెక్టర్ నోటీసులు పంపారు. ఎందుకు రాలేకపోయారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

సంగారెడ్డి సాయిబాబా గుడిలో
విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి: షిరిడీ సాయిబాబా అందరి దేవుడని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కొనియాడారు. సంగారెడ్డిలోని బైపాస్ సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వమత సమతుల్యాన్ని షిర్డి సాయి సూచిస్తున్నాయని అన్నారు. సాయి బాబా బోధనల మేరకు ప్రజలందరూ కలిసి కట్టుగా ఉండాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు.





సంగారెడ్డిలోని సాయిబాబా ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



పరిశ్రమ వద్ద శిథిలాల నుంచి మృతదేహం బయటపడడంతో రోదిస్తున్న రమేష్ కుటుంబ సభ్యులు

ఆర్తనాదాలు..
అరణ్య రోదన

- ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ వద్ద హృదయవిదారక దృశ్యం
- గల్లంతైనవారి కోసం కుటుంబ సభ్యుల గాలింపు
- మృతదేహాలు ఎక్కడున్నాయో తెలియక అయోమయం
- ఎవరిని అడగాలో.. ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని వైనం

హత్నూర, ఏప్రిల్ 4: హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట గురువారం మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తమవారి మృతదేహాలు ఎక్కడున్నాయో తెలియక కొందరు... గల్లంతయినవారి కోసం మరికొందరు కన్నీరుమున్నీరయ్యారు. ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియక... ఎవరిని అడగాలో దిక్కుతోచక పరిస్థితిలో బిక్కుబిక్కుమని ఏడుస్తూ కూర్చున్నారు. ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం జరిగిన పేలుడు ఘటనలో పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ, సుబ్రహ్మణ్యం, దయానంద్, సురేష్‌పాల్, చాకలి విష్ణు, వడ్డేపల్లి రమేష్ మృతి చెందగా.. మరో 19 మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. అయితే మృతుల కుటుంబీకులు గురువారం నాడు పరిశ్రమ వద్దకు చేరుకొని రోదిస్తున్న తీరు వర్ణనాతీతంగా మారింది.

పనికి వెలుతున్నానని చెప్పి...



రమేష్ (ఫైల్)

హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన వడ్డేపల్లి రమేష్ (32) మృతదేహం గురువారం ఉదయం శిథిలాల కింద దొరికింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అధికారులు ప్రకటించిన మృతుల్లో ఆయన పేరు లేకపోవడంతో చికిత్స పొందుతున్నాడేమోనని ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఎక్కడా లేకపోవడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులే పరిశ్రమలో శిథిలాల కింద వెతుకులాడగా ఆయన మృతదేహం లభించింది. ఎక్కడో బతికే ఉంటాడని ఆశపడగా మృతదేహంగా కనిపించడంతో గుండెలు పగిలేలా రోదించారు. మృతుడి భార్య రేణుక మూడు నెలల గర్భిణి. ఆమె రోదన అక్కడివారిని కన్నీరు పెట్టించింది. మృతుడు తండ్రి రమేష్ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. ఏడాది లోపే తండ్రీ, కొడుకులు మృతి చెందడంతో మృతుడి తల్లి భారతమ్మ రోదనలు మిన్నంటాయి. కంపెనీకి వెళ్తున్నానని చెప్పి కానరాలని లోకానికి వెళ్లాడంటూ బోరున విలపించారు.

నెల క్రితమే కవలలు.. ఇంతలోనే..



పరిశ్రమ పేలుడులో మృతిచెందిన చాకలి విష్ణు(32)ది నిరుపేద కుటుంబం. హత్నూర మండలం చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాములమ్మ, పాండరయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు. అందరిలో చిన్నవాడైన విష్ణు వద్దే తల్లిదండ్రులు ఉంటున్నారు. గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆయనకు నెల క్రితమే ఇద్దరు పాపలు (కవలలు) జన్మించారు. బుధవారం జరిగిన ప్రమాదంలో ఆయన మృతిచెందడంతో కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. ఇద్దరు కూతుళ్లు పుట్టారని సంతోషంగా చెప్పుకునేవాడని.. నెల రోజులైనా కాకముందే.. చిన్నారుల ఆలనాపాలన చూడకుండానే మృత్యుఒడిలోకి చేరాడని బావురుమన్నారు.

అంచలంచెలుగా ఎదిగిన రవిశర్మ



ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ పరిశ్రమలో సంభవించిన భారీ ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా గురుజాల గ్రామానికి చెందిన రవిశర్మ అంచలంచెలుగా పరిశ్రమ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. కుటుంబంతో హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉంటున్నారు. మృతుడి భార్య ఉషారాణి ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. కూతురు సాయి సుస్మిత, కుమారుడు షణ్ముఖ శ్రీకృష్ణ ఉన్నారు. కంపెనీకి డైరెక్టర్ అయినా కార్మికులందరితో కలుపుగోలుగా ఉండేవాడని, ఆయన మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందని ఉద్యోగులు పేర్కొన్నారు.



విధులకు వెళ్లి..
తిరిగిరాని లోకాలకు



మృతి చెందిన దయానంద్ (ఫైల్)

ప్రమాదంలో మృతిచెందిన దయానంద్ చెన్నైకి చెందిన వారు. 30 ఏళ్ల క్రితం దౌల్తాబాద్‌కు వచ్చి పరిశ్రమల్లో పనిచేసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో దయానంద్ ప్రొడక్షన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. భార్య మెటిల్డా, కూతురు లారా, కుమారుడు ఆసీస్‌తో కలిసి ఉంటున్నారు. లారా బీఫార్మసీ చదువుకొని ప్రస్తుతం చెన్నైలో ట్రైనింగ్ చేస్తున్నారు. కుమారుడు ఆసీస్ ఇంటర్ చదువుతున్నాడు. మెటిల్డా దౌల్తాబాద్‌లోనే ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. దయానంద్ ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయింది.

పటాన్‌చెరు, ఏప్రిల్ 4 : నగర శివారులో సంగారెడ్డి జిల్లాలో దాదాపు 1,100 రసాయన పరిశ్రమలుండగా.. తనిఖీ చేసే అధికారులు మాత్రం ఇద్దరే ఉన్నారు. పరిశ్రమల్లో అసలేం జరుగుతుందో పర్యవేక్షించే వారు లేక ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పటాన్‌చెరు, పాశమైలారం, ఐడీఏ బొల్లారం, ఖాజిపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి, హత్నూర, ఇస్నాపూర్, చిట్కుల్, రుద్రారం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున బల్క్‌డ్రగ్, ఫార్మా, రసాయన పరిశ్రమలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమలకు వెళ్లిన కార్మికుడు సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు వారి కుటుంబీకులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో రియాక్టర్ పేలుడుతో పరిశ్రమల్లో భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. జిల్లాలోని పారిశ్రామికవాడల్లో గత ఆరు నెలల్లో ఐదారు భారీ ప్రమాదాలు జరిగాయి. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం.. శిక్షణ లేని కార్మికులతో పనులు చేయించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రమాదకరమైన రియాక్టర్లు, సెంటర్‌ఫ్యూజ్‌ల వద్ద ఎలాంటి ప్రాథమిక శిక్షణ లేని కాంట్రాక్టు కార్మికులచే పనులు చేయిస్తున్నారు. చాలా పరిశ్రమలో పనిచేసే చోట

1,100 పరిశ్రమలకు ఇద్దరే అధికారులు

- నామమాత్రంగా తనిఖీలు
- రియాక్టర్ల వద్ద శిక్షణ లేనివారితో పనులు



ప్రమాదంలో ధ్వంసమైన ఎస్‌బీ ఆర్గానిక్స్

కార్మికులకు హెల్మెట్లు, కళ్లకు అద్దాలు, సేఫ్టీషూస్, యాప్రాన్ తదితర సామగ్రి ఇవ్వడం లేదు. ఎస్‌బీ ఆర్గానిక్స్ పేలుడులో మృతి చెందిన కొందరు కార్మికులు చెప్పులు ధరించి ఉండటం, హెల్మెట్లు లేకపోవడమే ఇందుకు నిదర్శనం. పరిశ్రమలో జరుగుతున్న ఉత్పత్తి, వాడే రసాయనాలు, వాటి స్వభావం, టెంపరేచర్ నియంత్రణపై శిక్షణ లేకుండానే పని చేయిస్తున్నారు. ఇటీవల ఐడీఏ బొల్లారంలో ఓ పరిశ్రమలో ప్రమాదకరమైన డ్రగ్స్ తయారు చేస్తుండగా నార్కొటిక్ అధికారులు పట్టుకున్నారు. వాస్తవానికి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఏం తయారు చేస్తున్నామో కనీస అవగాహన లేకపోవడం గమనార్హం. అలాగే, జిల్లాలో 1,100 పరిశ్రమలను తనిఖీ చేసేందుకు ఒక ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఒక డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మాత్రమే ఉన్నారు. వారు ప్రతీ పరిశ్రమను తనిఖీచేయడం అసాధ్యం. దీంతో కూర్చున్న చోటనే రికార్డులు సృష్టించి నివేదికలిస్తున్నారు. ఏడాదిలో వందలాది పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తనిఖీలు చేసినట్టు చెప్పినా ఒక్క ఫ్యాక్టరీకి సైతం నోటీసు జారీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రమాదాలు జరిగినా ఒక్క యజమానిపై కూడా కేసు నమోదు కాకపోవడం గమనార్హం. కిందిస్థాయి సిబ్బందిపై మాత్రమే కేసులు నమోదుచేసి యజమానులను తప్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



రోదిస్తున్న సురేష్‌పాల్ భార్య, బంధువులు

ఉపాధి కోసం వచ్చి మృత్యుఒడికి..



మధ్యప్రదేశ్ రాష్ట్రం క్రియన్ ఫాలోని జిల్లా కరేరా మండల్ చిప్రి గ్రామానికి చెందిన సురేష్‌పాల్ ఇరవయ్యేళ్ల క్రితం ఉపాధి కోసం ఇక్కడికి వచ్చారు. ఆయనకు భార్య రామ్‌భక్తి పాల్, పిల్లలు శివం పాల్, మనీష్‌పాల్, వైష్ణవి ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ రెండు దశాబ్దాలుగా ఎస్‌బీ పరిశ్రమలో పని చేస్తున్నారు. రోజూలాగే బుధవారం మధ్యాహ్నం విధులకు వెళ్లిన సురేష్‌పాల్ ప్రమాదంలో మరణించాడని తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ప్రమాదం జరిగి ఇన్ని గంటలవుతున్నా భర్త మృతదేహాన్ని కూడా చూపలేదని, ఎక్కడుందో చెప్పడం లేదని రామ్‌భక్తిపాల్ విలపించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు సహాయం చేయాలని అధికారులను వేడుకున్న తీరు కలిచివేసింది.

విజయవాడ నుంచి వచ్చి.. సంగారెడ్డిలో స్థిరపడి



మృతుడు ప్రొడక్షన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్య స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ. మృతుడికి భార్య సుజాత, కుమారుడు నికిత్‌రామ్, కూతురు తన్విక ఉన్నారు. సంగారెడ్డి పట్టణంలో స్థిరపడ్డారు. ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో ప్రొడక్షన్ ఇన్‌చార్జి పనిచేస్తూ, ప్రతీరోజూ సంగారెడ్డి నుంచి కంపెనీకి వెళ్లివచ్చేవారు. రోజూలాగే బుధవారం కూడా విధులకు వెళ్లగా మృతదేహంగా తిరిగివచ్చాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇద్దరు పిల్లలతో తానెలా బతికేదని భార్య సుజాత రోదించిన తీరు కలిచివేసింది.

పేలుడు శబ్దానికి
పాఠశాలకు బీటలు

- భయంతో 100 మంది విద్యార్థులు గైర్హాజరు



చెట్ల కింద కూర్చున్న విద్యార్థులు



ధ్వంసమైన పాఠశాల తలుపు



పేలుడు తీవ్రతకు పగిలిన పైకప్పు రేకులు

హత్నూర, ఏప్రిల్ 4: ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం జరిగిన భారీ పేలుడు తీవ్రతకు సమీపంలోని బోర్పట్ల గ్రామ ఉన్నత పాఠశాల భవనం బీటలు వారింది. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమకు సుమారు 200 మీటర్ల దూరంలోనే బోర్పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంటుంది. పరిశ్రమ నుంచి ఇంకా పొగ వెలువడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడానికి ముందుకురాలేదు. పాఠశాలలో మొత్తం 210 మంది విద్యార్థులుండగా.. గురువారం ఉదయం 110 మంది మాత్రమే హాజరయ్యారు. పేలుడు శబ్దం ఏడెనిమిది కిలోమీటర్ల వరకు వినిపించిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చని, ఆ సమయంలో స్కూల్ ఉంటే పేలుడు ధాటికి విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండేదని ఉపాధ్యాయుడు భానుప్రకాశ్ పేర్కొన్నారు. పేలుడు కారణంగా బడికి పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారని చెప్పారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు తెలిపారు.

సమీపంలోని పరిశ్రమలు ధ్వంసం

ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో జరిగిన పేలుడు తీవ్రతకు సమీపంలో ఉన్న పరిశ్రమల పైకప్పు దెబ్బతిన్నది. పరిశ్రమకు సమీపంలో ఉన్న బీఎస్‌పీ కంపెనీ పరిశ్రమ పైకప్పు రేకులు పగిలి చెల్లాచెదురుగాపడ్డాయి. లోపలి గదుల్లోని కిటికీలు, తలుపులు, అద్దాలు పగిలిపోయాయి. వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం కార్మికులందరినీ బయటకు పంపించింది.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా.రవీందర్‌నాయక్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4 : క్షతగ్రాత్రులకు మెరుగైన వైద్య అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా.రవీందర్‌నాయక్ ఆదేశించారు. హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ పరిశ్రమలో రియాక్టర్ పేలి గాయాలపాలై సంగారెడ్డి మండలం ఫసల్‌వాది శివారులోని ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన గురువారం పరిశీలించారు. ఘటన జరిగిన తీరును బాధితుల ద్వారా తెలుసుకున్నారు. ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య చికిత్సలపై ఆరా తీశారు. అనంతరం సంగారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీతో సమావేశమైన ఆయన జిల్లాలో వైద్య పథకాల అమలు తీరుపై సమీక్షించారు.



ఎంఎన్ఆర్ ఆసుపత్రిలో క్షతగ్రాతులను పరామర్శిస్తున్న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

కుటుంబీకులకు మృతదేహాల అప్పగింత

రియాక్టర్ పేలి దుర్మరణం చెందిన ఆరుగురు మృతదేహాలకు సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. నిపుణులైన డాక్టర్ల చేత శవపరీక్ష నిర్వహించిన అనంతరం గురువారం సాయంత్రం డెడ్‌బాడీలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

బైక్.. ట్రాక్టర్ ఢీ
ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

బంధువుల ఇంట్లో పెళ్లి పనుల కోసం వెళ్తుండగా ఘటన

కల్హేర్, ఏప్రిల్ 4: బంధువుల ఇంట్లో పెళ్లి పనుల్లో భాగంగా బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండల పరిధిలోని ఇందిరానగర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన కాటిపాపల సాయిలు(40), వడ్డెర సాయిలు(16), నారాయణఖేడ్‌కు చెందిన విభూతి సాయిలు(16) ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై నారాయణఖేడ్, కల్హేర్ రహదారిపై కల్హేర్ వైపు వెళ్తున్నారు. ఇందిరానగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంలో కాటిపాపల సాయిలు తల ఛిద్రమై అక్కడిక్కడే మరణించగా వడ్డెర సాయిలు ఎగిరి రహదారి పక్కన పడి మరణించాడు. విభూతి సాయిలుకు తీవ్ర గాయాలు కాగా నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కల్హేర్‌లో బంధువుల ఇంట్లో శుక్రవారం జరుగనున్న పెళ్లి ఏర్పాట్లు చేస్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో, పెళ్లి విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘట సమాచారం తెలియగానే క్రిష్ణాపూర్, ఇందిరానగర్ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున చేరుకున్నారు. మృతదేహాలపై కుటంబ సభ్యులు పడి రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. ప్రమాదంలో చనిపోయిన ఒకరు, తీవ్ర గాయాలకు గురైన మరో యువకుడు ఇరువురు 16 సంవత్సరాల యువకులు కాగా, కాటిపాపల సాయిలుకు భార్య రాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటన స్థలానికి కల్హేర్ ఎస్ఐ వెంకటేశం, హెడ్ కానిస్టేబుల్ గంగారాం చేరుకుని మృతదేహాలను నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుచున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొండాపూర్ పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్

కొండాపూర్, ఏప్రిల్ 4 : కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రి దేవిలో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో సౌకర్యాలు, వసతులు, ఆరోగ్య సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. సెంటర్‌లో రోజుకు అనారోగ్యంతో ఎంతమంది వస్తుంటారు, గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సందేహాలను ఎలా నివృత్తి చేస్తారని ప్రశ్నించారు.ల్యాబ్ పరీక్షలు, టీబీ, లెప్రసీ ఉన్నయా, ఆరోగ్య మహిళా క్యాంపు నిర్వహిస్తున్నారా అని వైద్యాధికారి రేష్మఅంజుమ్ బేగంను అడిగారు. అందుబాటులో ఉండి అడిగివన్నీ హెల్త్ సెంటర్‌లో చేస్తున్న సేవలు, పలు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తునట్లు తెలపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశాడు. ఆయన వెంట మెడికల్ అధికారి ఖలీధహుస్సేన్, హెల్త్ సెంటర్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులలోనే ప్రసవాలు అయ్యేలా చూడాలి

● డీపీహెచ్‌ఎన్‌వో యేసు మేరీ

మద్దూరు, ఏప్రిల్ 4 : ప్రభుత్వ ఆస్పత్రులలోనే డెలివరీలు చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా చూడాలని డీపీహెచ్‌ఎన్‌వో యేసు మేరీ సూచించారు. గురువారం లద్నూరు, మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు ఆస్పత్రులలో డెలివరీలు అయితే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందవన్నారు. సాధ్యమైన మేరకు నార్మల్ డెలివరీలు అయ్యే విధంగా చూడాలని సూచించారు. వారి వెంట వైద్యాధికారులు స్టువర్ట్‌సన్, రజిత, సీహెచ్‌వో మాణిక్యమ్మ, యూడీసీ సుదయ్య సూపర్‌వైజర్ రోసిలిన్, ఏఎన్‌ఎం, ఆశాలు ఉన్నారు.

ఎన్నికల బరిలో భవన నిర్మాణ రంగ కార్మికుడు

● కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం
● బీఎన్‌ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4 : పద్నాలుగు రంగాల కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ అభ్యర్థిగా భవన నిర్మాణ రంగ కార్మికుడిని నిలబెడుతున్నామని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం(బీఎన్‌ఆర్‌కేఎస్) జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ముదిరాజ్ తెలిపారు. కార్మిక రంగా సమస్యలను పరిష్కరించడంలో అన్ని ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన మండిపడ్డారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులంటే అన్ని ప్రభుత్వాలకు చులకన అయిపోయిందని, కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. భవన నిర్మాణ రంగ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఎన్నికల బరిలో నిలబడుతున్నామన్నారు. కార్మికులు పనిచేసే చోట ప్రమాదానికి గురైతే కనీస వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 14 రంగాల కార్మికులు ఏకమై భవన నిర్మాణ కార్మిక సంఘం తరఫున బరిలో నిలిపిన అభ్యర్థికి మద్దతు తెలిపి ఓటు ద్వారా సత్తా చాటాలని కోరారు. ఈ సమావేశంలో సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు ఐరెని ముకుందం, నాయకులు చంద్రం కనకయ్య, మల్లేశం జక్కుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సాయివెల్దికుంట శిఖం ఆక్రమణపై డీఈ పరిశీలన

మద్దూరు, ఏప్రిల్ 4 : మండల పరిధి మర్మాముల గ్రామ శివారులోని సాయివెల్ది కుంట శిఖంలో రోడ్డేసి భూ ఆక్రమణకు పాల్పడ్డట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డీఈ శ్యాం గురువారం సందర్శించారు. గ్రామానికి చెందిన ఇప్ప నిశికాంత్‌రెడ్డి గజ్వేల్ ఈఈ కార్యాలయంలో చేసిన ఫిర్యాదు మేరకు పరిశీలనకు వచ్చినట్లు డీఈ తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా లేదా అనేది స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పూర్తి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వే నం.75లో గల సాయివెల్దికుంట ఎ.9.32 గుంటల విస్తీర్ణంతో ఉందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కుంట శిఖంలో బాట వేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు త్వరలో రెవెన్యూ అధికారులతో కలిసి పూర్తి విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సుందరగిరి సత్యనారాయణ, వెల్ది గోపాల్‌రెడ్డి, శీలం సిద్ధయ్యతో పాటు పలువురు ఉన్నారు.

కారును నమ్మే పరిస్థితులు ల్లేవ్

- మాజీ సీఎం కుమార్తె జైలుకు వెళ్లారు..
- ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటన


మాట్లాడుతున్న ఎలక్షన్‌రెడ్డి

మనోహరాబాద్, ఏప్రిల్ 4: మాజీ సీఎం కుమార్తే జైలుకు పోయింది. తెలంగాణలో కారును నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి చెందిన ఆయన.. కేసీఆర్ విజయం కోసం పలుమార్లు పని చేశారు. త్వరలోనే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. తాజాగా గురువారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కారు సర్వీసింగ్‌కు కాదు.. చివరి దశకు చేరిందని అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ వారు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు ఇప్పటి వరకు ఇవ్వలేదని, మాజీ సర్పంచ్‌లందరి పక్షాన నిలబడుతానని అన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి


ముత్తంగి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

పటాన్‌చెరు, ఏప్రిల్ 4 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి తగిన చ్యలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. గురువారం ముత్తంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యుడిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న మందులపై ఆరా తీశారు. అనంతరం పాటి గ్రామపంచాయతీని సందర్శించి సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై పంచాయతీ ప్రత్యేక అధికారి, సెక్రెటరీని అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడిపై వచ్చే ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన 08455276155 నంబర్‌ను పంచాయతీల్లో ప్రదర్శించాలన్నారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 4: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్(ఏపీవో)లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అధికారులు ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్‌పోలింగ్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కనెక్షన్లు, వాటి పనితీరు, మరమ్మతు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలన్నారు. శిక్షణలో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. తొలి విడతలో 488 మంది పీవో, ఏపీవోలు శిక్షణ పొందారని, రెండో విడత ఈనెల 6న ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి రాజిరెడ్డి, అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

నర్సాపూర్, ఏప్రిల్ 4: పోలింగు కేంద్రాలలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగంచుకునేటట్టు చూడాల్సిన బాధ్యత పీవో, ఏపీవోలదే మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజు తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్లమెంటు ఎన్నికల నిర్వాహణలో పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మాక్ పోలింగులో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలని, వేసిన ఓట్లు వీవీప్యాట్‌లోని స్లిప్‌లతో సరిచూసిన తర్వాత ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేసి అనంతరం నిర్దేశించిన పోలింగు ప్రక్రియ ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


కమనీయం.. వీరభద్రుడి కల్యాణం

- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఈవో
- వైభవంగా అగ్నిగుండాలు
- నేడు స్వామి వారి రథోత్సవం


బొంతపల్లి వీరన్నగూడెం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


అగ్నిగుండాలను తొక్కుతున్న భక్తులు

గుమ్మడిదల, ఏప్రిల్ 4 : సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వీరన్నగూడెం భద్రకాళీ సహిత వీరభద్రస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఆవరణలో సర్వాంగసుందరంగా అలంకరించిన కల్యాణమండపంలో వీరభద్రుడు, భద్రకాళి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం ఈవో శశిధర్‌గుప్తా ఆలయ సంప్రదాయం ప్రకారం స్థానిక నాయకులతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు. ఉత్సవవిగ్రహాలకు వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. భక్తులు కట్న కానుకలను సమర్పించారు. కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సంర్పంచ్ ఆలేటి నవీనా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, గిద్దెరాజు స్థానిక నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఆలయం ఆవరణలో అగ్నిగుండాల పూజకార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున భక్తులు నిప్పులపై నడిచి మొక్కులను తీర్చుకొన్నారు. శుక్రవారం నాడు వీరభద్రస్వామి భద్రకాళీ అమ్మవారి విమాన రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.


సిద్దిపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో యోగా(ఫైల్)

ఆరోగ్య యోగం

సిద్దిపేట నుంచి విశ్వవ్యాప్తంగా..

- ఆన్‌లైన్‌లో యోగా పాఠాలు
- పది దేశాల్లో సాధన చేస్తున్న ప్రవాస భారతీయులు
- వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4 : నిత్యం బిజీగా.. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది యోగాను ఆశ్రయిస్తున్నారు. మానసిక శారీరక ఆరోగ్యం కోసం రోజులో కొద్దిసేపు యోగాకు కేటాయిస్తున్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో దేశవిదేశాల్లో యోగా అవసరం.. సాధన వల్ల చేకూరే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. ఈ క్రమంలోనే సిద్దిపేట కేంద్రంగా వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో స్థానికంగా యోగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించి.. సొసైటీ నిర్వాహకులు తోట సతీష్, సంధ్య దంపతులు క్రమంగా ఆన్‌లైన్‌లో సుమారు పది దేశాలకు చెందిన ప్రవాస భారతీయులకు ఉచితంగా శిక్షణనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అమెరికా, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లోని సుమారు 500 మందికి పైగా ఆన్‌లైన్‌లో యోగా శిక్షణలో పాల్గొంటున్నారు. కేవలం కొద్ది మందితో సొసైటీ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించగా, మాజీ మంత్రి.. ఎమ్మెల్యే హరీష్‌రావు చొరవతో పట్టణంలోని అన్ని వార్డులకు యోగా సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణనివ్వడం ప్రారంభించారు. క్రమంగా ఆన్‌లైన్ వైపు మళ్లి.. అంతర్జాతీయ అభ్యాసకులతో యోగాసనాలు వేయిస్తున్నారు. అంతేస్థాయిలో ఆదరణ పెరగడంతో నిర్వాహకులు ఉత్సాహంగా యోగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

శిక్షకులుగా ఎదిగి..

సిద్దిపేట కేంద్రంగా ఏర్పాటైన వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న ఎందరో నేడు శిక్షకులుగా మారారు. హైదరాబాద్ వంటి నగరాల్లో పలువురికి శిక్షణ ఇస్తూ ఉపాధి సైతం పొందుతున్నారు. స్థానికులకే కాకుండా సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు, ప్రత్యేక సమయాల్లో వృద్ధులకు శిక్షణ ఇస్తూ మన్ననలు పొందుతున్నారు.



మూడేళ్ల నుంచి యోగా చేస్తున్నా..



మాది ఏపీలోని విజయవాడ. ప్రస్తుతం ఐర్లాండ్‌లో ఉద్యోగం చేస్తున్నా. మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో రోజూ వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిసు తనన యోగా తరగతులకు హాజరవుతున్నా. యోగాతో నాలో ఎంతో మార్పు వచ్చింది.

- శ్రీ మానేపల్లి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఐర్లాండ్

సిద్దిపేట యోగా తరగతులు ప్రత్యేకం



మాది భద్రాది కొత్తగూడెం. అమెరికాలో నివసిస్తున్నా. రెండున్నరేళ్లుగా ఆన్‌లైన్‌లో యోగా సాధన చేస్తున్నా. అమెరికాలో యోగా చేయించేవారున్నా.. సిద్దిపేటలో వ్యాస మహర్షి యోగా సొసైటీ వారు చెప్పే తరగతులు ప్రత్యేకం.

- నరేష్, యూఎస్ఏ, ఐటీ కన్సల్టెంట్

ఇతరులకు సూచిస్తున్నా..



ఎవరైనా యోగా తరగతులు హాజరు కావాలంటే వ్యాస మహర్షి యోగా సొసైటీలో నేర్చుకోవాలని సూచిస్తున్నా. మేము దాదాపు రెండు సంవత్సరాల నుంచి సాధన చేస్తున్నాం. గతంలో తీవ్రమైన వెన్ను నొప్పులు, మెడ నొప్పులుండేవి. యోగ చేయడం వల్ల పూర్తిగా తగ్గాయి.

- సరిత అల్లంపల్లి, బిజినెస్ అనలిస్ట్, ఐర్లాండ్

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం



దశాబ్ధ కాలంగా సిద్దిపేటలో యోగా శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాలు సహకరిస్తున్నాయి. అందరికీ ఆరోగ్యం, ఆనందం అందించాలన్న ఉద్దేశంతో పని చేసున్నాం. పట్టణ స్థాయి నుంచి వివిధ దేశాలకు విస్తరించడం ఆనందంగా ఉంది.

- నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షుడు, వ్యాస మహర్షి యోగ సొసైటీ

గూడెం మధుకు బెయిల్ మంజూరు

పటాన్‌చెరు, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ నాయకుడు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూధన్‌రెడ్డి గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదల అయ్యారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై 20రోజుల క్రితం ఆయన అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. సంగారెడ్డి సివిల్ కోర్టు న్యాయాధికారి తేజస్విని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. దీంతో గురువారం సాయంత్రం జైలును నుంచి విడుదల అయి, పటాన్‌చెరులోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. చట్టాన్ని గౌరవిస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూం

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 4 : కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. జిల్లాలో 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని శుభ్రం చేయడానికి ప్యాడీక్లీనర్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు.

జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

- రూ.3 లక్షల వరకు అద్దె చెల్లించపోవడంతో యజమాని చర్య


జహీరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం వేయడంతో బయటే ఉన్న సిబ్బంది

జహీరాబాద్, ఏప్రిల్ 4 : అద్దె చెల్లించకపోవడంతో ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేయగా తాజాగా గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం పడింది. రెండేళ్లుగా సుమారు రూ.3 లక్షల వరకు అద్దె డబ్బు చెల్లించక పోవడంతో ఇంటి యజమాని తాళం వేశారు. ఇంతకుముందు మార్చి 27 నాడు కూడా ఆస్పత్రికి తాళం వేయగా ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది స్థానికంగ నెలకొన్న పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించడంతో మార్చి నెలాఖరువరకు చెల్లించేలా కృషిచేస్తామని చెప్పడంతో వెనుదిరిగి పోయాడు. అయినా ఇప్పటివరకు స్పందన రాకపోవడంతో మరోమారు తాళం వేశానని యజమాని తెలిపారు. తనకు పెండింగ్‌లో ఉన్న అద్దెను చెల్లిస్తేనే తాళం తీస్తానని ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి తేల్చిచెప్పాడు. అయితే అద్దె డబ్బు చెల్లింపు సమస్య తమ పరిధిలోనిది కాదని మరోమారు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది సాయంత్రం వరకు బయటే ఉండి వెళ్లిపోయారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు తాళం వేసి ఉన్న పరిస్థితిని గమనించి వెనుదిరిగిపోయారు.

ఇంకా తెరచుకోని తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీ

తూప్రాన్, ఏప్రిల్ 4: ఉమ్మడి జిల్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె చెల్లింపును మాత్రం పట్టించుకోవడం లేదు. నాలుగేళ్లుగా అద్దె పెంపు చేయాలని యజమాని డిమాండ్ చేస్తుండటం, ఏడాది కాలంగా అద్దె ఇవ్వకపోవడంతో గతేడాది నవంబర్‌లో భవన యజమాని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేశాడు. సిబ్బంది హామీతో తాళం తీయగా, కొద్దిగా మాత్రమే అద్దె చెల్లింపు చేశారు. దాంతో విసుగు చెందిన భవన యజమాని మళ్లీ ఈనెల ఒటిన సోమవారం తాళం వేశాడు. తాళం వేసి నాలుగు రోజులు గడిచిపోతున్న అధికారుల పట్టింపు లేకుండా పోయింది. ప్రతి రోజు సిబ్బంది వస్తు పోతున్నారే తప్ప ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళాలు తీయించే ప్రయత్నాలు చేయడంలేదు. రోజు సుమారు 70 మంది వరకు ఓపీ రోగులు వస్తుంటారు. వీటికి తోడు వైద్యుడితో సెలవుల తదితర వాటికి రిపోర్టులు సంతకాలు అవసరముండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లేకపోవడంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఎండుతున్న పంటలు.. రైతుల విలవిల

- ఇంద్రకరణ్‌లో ట్యాంకర్‌ల కారణంగా పడిపోయిన నీటి నిల్వలు
- కందిలో కిసాన్‌సాగర్ తూము పనిచేయక ఎండిపోతున్న వరిపొలం
- కట్టు కాల్వలను మూసేసిన దాబాల యజమానులు


ఇంద్రకరణ్ శివారులో ఎండిన వరి పంట

కంది, ఏప్రిల్ 4 : చేతికొచ్చిన పంట చేను ఎండపోవడం చూసి రైతన్నలు విలవిలలాడుతున్నారు. కంది మండలంలో ఓవైపు ట్యాంకర్ల కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతుంటే, మరోవైపు కిసాన్‌సాగర్ చెరువు తూము గేటుపాడవడంతో నీరందక పొలాలు ఎండిపోతున్నాయి.

నీటి ట్యాంకర్ల కట్టడేదీ?

మండల పరిధిలోని చేర్యాల, ఇంద్రకరణ్, కాశీపూర్ గ్రామాల్లో రైతుల పంట పొలాల వద్ద నీటి దళారులు ట్యాంకర్‌ల ద్వారా వ్యాపారం మొదలుపెట్టారు. వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తోడుకుని పరిశ్రమలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. నీటి ట్యాంకర్ల దళారులు వారి స్వలాభం కోసం చేసే పనికి చివరికి పంటలకు నీరందని దుస్థితి నెలకొన్నది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నీటి ట్యాంకర్లను కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని తూము

కిసాన్‌సాగర్ చెరువు నిండా నీరు ఉన్నప్పటికీ చెరువు కిందకు నీటిని తరలించే తూము మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో నీరు పంటపొలాలకు రాక రైతుల బాధ వర్ణనాతీతంగా మారింది. అంతేగాక ఇతర తూముల ద్వారా వచ్చే కట్టు కాల్వలను కొందరు రియల్టర్లు, ప్లాట్ల విక్రయాల కోసం, మరికొందరు దాబా యజమానులు తమ పార్కింగ్ స్థలాల కోసం మూసివేశారు. ఈ విషయం అధికారులకు ఎన్ని పర్యాయాలు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలి



కిసాన్‌సాగర్ చెరువు కింది సాగు చేసిన ఆరు ఎకరాల వరి పంట నీరందక ఎండిపోయింది. కేవలం అధికారుల నిర్యక్ష్యం కారణంగా ఎండిన పంటకు నష్ట పరిహారం ఇప్పించాలి. అలాగే కిసాన్‌సాగర్ చెరువు తూము గేటును వెంటనే మరమ్మతు చేయించాలి. కట్టు కాల్వలో పూడిక తీయించాలి.

- బండి వీరారెడ్డి, రైతు, కంది

తూము గేటుకు మరమ్మతు చేయిస్తాం

కిసాన్‌సాగర్ చెరువు తూము గేటు మూసుకుపోయిన మాట వాస్తవమే. చాలా కాలంగా అది వాడుకలో లేకపోవడం వల్ల పని చేయలేదు. దీంతో కిసాన్‌సాగర్ చెరువు కింది అయకట్టుకు నీటి సరఫరా అందడం లేదు. వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

- మజారుద్దీన్, ఏఈ, ఇరిగేషన్

వారంలో మూడుసార్లు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్


కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న రైతులు

మనోహరాబాద్, ఏప్రిల్ 4 : మండలంలోని గౌతోజీగూడ గ్రామంలో కరెంట్ కష్టాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఇబ్బందులతో పంటలు ఎండుతున్నాయి. గ్రామంలో వారం రోజుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మూడుసార్లు కాలిపోయింది. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఎండలు దంచికొట్టడంతో పాటు, కరెంట్ సరఫరా సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని అన్నదాతలు తెలిపారు. పంట చేతికి వచ్చే సమయానికి తడులు పారించలేకపోతున్నామని తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ గుండానే గ్రామానికి నీటిని అందజేసే బోరు కనెక్షన్ ఉండటంతో వారం రోజులుగా త్రాగునీటికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నమని మాజీ సర్పంచ్ బోడ్డు వెంకటేశ్వర్లు తెలిపారు.


అక్కన్నపేట అడవిలో ఎగిసిపడుతున్న మంటలు, ఆర్పుతున్న అటవీ సిబ్బంది

అటవీ ప్రాంతంలో మంటలు

- ఆధునిక సాంకేతికతో ఆర్పిన అటవీ సిబ్బంది
- అప్పటికే ఎనిమిది ఎకరాలు దగ్ధం

రామాయంపేట, ఏప్రిల్ 4 : మెదక్ జిల్లా అక్కన్నపేట అటవీ ప్రాంతంలో మంటలు ఒక్కసారిగా మంటలు ఎగసి పడి అడవి దగ్ధమైంది. గురువారం చిన్నగా చెలరేగిన మంటలు అడవి అంతా అంటుకోగా.. అటవీశాఖ అధికారులు హుటాహుటిన వచ్చి.. నూతన సాంకేతిక విధానంతో ఫైర్ సిబ్బంది సహాయం లేకుండానే మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే సుమారు ఎనిమిది ఎకరాల్లో అటవీ ప్రాంతం దగ్ధమైనట్లు తెలుస్తోంది. అటుగా వెళ్లిన వారు బీడీ, సిగరెట్ కాల్చుకునే తరుణంలో అగ్గిపుల్ల పడేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మంటలు చెలరేగాయని భావిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం

● 13 ట్రాక్టర్లు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 4: ఇసుక అక్రమ రవాణాపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఉక్కుపాదం మోపారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్, గుడి తండాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. భూసారాన్ని తగ్గించే విధంగా వ్యవసాయ భూమిలోని మట్టిని అక్రమంగా తవ్వి ట్రాక్టర్లలో నింపి, వడకట్టడం ద్వారా అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 13 ట్రాక్టర్లను సీజ్ చేశారు. హనుమాన్‌నగర్‌కు చెందిన ఎం.సాయికుమార్, విఠల్ నాయక్, బాల్యరావు సందీప్, ముడావత్ భాస్కర్, ఎస్.రాజేష్, ఎస్.వినోద్, తుకారాం, నినావత్ మన్యా, నినావత్ దాసు, ఎం.వినోద్, నినావత్ రాము, బబియా, నినావత్ గోవింద్‌లను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అధికారి తనిఖీలు

సదాశివపేట, ఏప్రిల్ 4: మండలంలోని ఆత్మకూర్ పీహెచ్‌సీలో గురువారం రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీలోని ఫార్మసీ, ల్యాబ్‌లను, రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, డాక్టర్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

'భగీరథ' తాగునీటికి నోచుకోని వెంకట్రావుపేట!

● లక్షలు వెచ్చించినా ప్రజల గొంతు తడపని అధికారులు

● ఏడాదిన్నరగా అలంకార ప్రాయంగా మారిన భగీరథ సంపు



రెడ్డిపల్లి-అల్లాదుర్గం చౌరస్తా వద్ద వెంకట్రావుపేటలో ఏర్పాటుచేసిన భగీరథ సంపు



నీటి ట్యాంకు (సంపు) కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అల్లాదుర్గం, ఏప్రిల్ 4: ఇంటింటికి మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న గత ప్రభుత్వ సంకల్పం కొందరు అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతున్నది. అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాలకు సరఫరా చేసే పైపులైన్లు పగిలిపోయి నీరంతా వృథాగా పోవడం, చాలీచాలని నీటితో ఆయా గ్రామాల ప్రజలు గొంతు తడుపుతుండగా.. వెంకట్రావుపేట గ్రామస్థులకు మాత్రం ఏళ్లు గడుస్తున్నా.. భగీరథ నీటికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా ట్యాంకును నిర్మించారు. ఈ ట్యాంకుకు అల్లాదుర్గం మీదుగా నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ కూడా ఏర్పాటు చేశారు. కానీ పైపుల ద్వారా భగీరథ నీరు రాకపోవడంతో అధికారులు రేగోడ్ మండలం జగిర్యాల నుంచి మరో కొత్త పైపులైన్ ఏర్పాటు చేశారు. అయినా నీరు రాకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. దీంతో గ్రామస్థులు రెండేళ్ల క్రితం ఆందోళన చేయగా.. ప్రభుత్వం స్పందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.12 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో అల్లాదుర్గం-రెడ్డిపల్లి చౌరస్తా వద్ద మరో కొత్త నీటి సంపు నిర్మింపజేసి, గ్రామానికి మరో పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయినా గ్రామానికి నీరు రాకపోవడంతో ఏడాదిన్నరగా ట్యాంకు అలంకార ప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి: హన్మంతరావు



బాల సదనంలో పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 4: పిల్లల బాగోగులు ఎప్పటికప్పుడు చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు సూచించారు. సంగారెడ్డి పట్టణంలోని బాల సదనాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల సదనంలోని పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని బాల సదన్ సూపర్‌వైజర్ విజయకుమారికి సూచించారు. బాల సదనం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ, పోక్సో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మాసాయిపేటలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మాసాయిపేట, ఏప్రిల్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు మాసాయిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చేగుంట ఎస్‌ఐ-1 బాలరాజు ఆధ్వర్యంలో రామాయంపేట సీఐ వెంకటేశ్వర్లు, చేగుంట ఎస్‌ఐ-2 మల్లారెడ్డి కేంద్ర బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ప్రజల్లో ధైర్యం నింపాలనే ఉద్దేశంతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

ట్యాంక్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



ప్రభు(ఫైల్)

కొండాపూర్, ఏప్రిల్ 4: మానసిక పరిస్థితి బాగలేక ఓ వ్యక్తి మిషన్ భగీరథ ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొండాపూర్ మండలం మాచెపల్లి పంచాయతీ మధిర సీతారాంకుంట గ్రామానికి చెందిన రాత్ల ప్రభు(35) నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకున్నాడు. అప్పటి నుంచి మానసిక పరిస్థితి బాగలేక ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయేవాడు. కుటుంబ సభ్యులు వెతికి తీసుకొచ్చేవారు. ఈ క్రమంలో కల్లు, మద్యానికి అలవాటు పడ్డాడు. కాగా గురువారం ఉదయం మిషన్ భగీరథ ట్యాంక్ పైనుంచి దూకాడు. కుటుంబసభ్యులు వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిశంకర్ తెలిపారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 4: ఏడుపాయల వన దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తుడు నీట మునిగి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకున్నట్లు పాపన్నపేట ఎస్ నరేష్ తెలిపారు. హైదరాబాద్ సంజీవరెడ్డినగర్‌కు చెందిన వెంకటేశ్(28) బంధువులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. స్నానం చేసేందుకు వెళ్లి మంజీరా పాయల్లో మునిగి చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

భర్త కొట్టడంతో భార్య ఆత్మహత్య

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 4: భర్త కొట్టడంతో భార్య ఆత్మహత్య చేసుకున్నది. సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్‌లో గురువారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన రాథోడ్ రాములుకు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి మండల పరిధిలోని మెల్లకుంటతండాకు చెందిన ఆంగోత్ దశరథ్ కూతురు సునీత(35)తో 9 ఏళ్ల క్రితం వివాహమైంది. బుధవారం రాత్రి భర్త కొట్టడంతో పాటు వేధింపులు భరించలేక సునీత పురుగుల మందు తాగింది. స్థానికులు నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి దశరథ్ ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి నలుగురు సంతానం ఉన్నారు.

బాలిక అదృశ్యం



మౌనిక(ఫైల్)

కొండాపూర్, ఏప్రిల్ 4: బాలిక అదృశ్యమైన సంఘటన మల్కాపూర్ చౌరస్తాలో జరిగింది. నాగల్‌గిద్ద మండలం మహిసెల్గితండాకు చెందిన చందర్ కుటుంబంతో కలిసి కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా తాహేర్ ఫంక్షన్‌హాల్ వెనకాల నివాసముంటున్నాడు. ఇతని కూతురు రాథోడ్ మౌనిక గతనెల మార్చి 26 నుంచి కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి కుటుంబీకులు బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి చందర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిశంకర్ తెలిపారు.

సమాచారం

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

మునిపల్లి: బీజేపీ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దగోపులారానికి చెందిన ఉపేందర్, ఉపాధ్యక్షులుగా నాగిశెట్టి, శ్రీకాంత్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, సాయి, ప్రధాన కార్యదర్శులుగా రామ్‌రాఘు, రాజు, బస్వరాజ్, కార్యదర్శులుగా పరశురాం, శివకుమార్, శివప్రసాద్, కోశాధికారిగా ప్రవీణ్, యువ మోర్చా మండలాధ్యక్షుడిగా శేఖర్‌యాదవ్, మహిళా మోర్చా మండలాధ్యక్షురాలిగా శ్రీనిధిఅయ్యప్పస్వామి, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడిగా రాజిరెడ్డి, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడిగా నర్సింహులు, మైనార్టీ మండలాధ్యక్షుడిగా ఫహీం, బీసీ మోర్చా మండలాధ్యక్షుడిగా మల్లేశంలను నియమించారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా అమ్రాది ఎల్లయ్య

కొండాపూర్: బీజేపీ జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రమైన కొండాపూర్‌కు చెందిన అమ్రాది ఎల్లయ్యను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి

అల్లాదుర్గం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో బీజేపీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు.

పూసల్‌పాడ్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీ

నాగల్‌గిద్ద: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా, మండల పరిధిలోని పూసల్‌పాడ్ చౌరస్తాలో గురువారం ఏఎస్‌ఐ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలతో పలు వాహనాలను ముమ్మరంగా తనిఖీ నిర్వహించారు. అధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడి చెరలో ఈనాం భూమి

● భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



సిర్గాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడి కబ్జాలో ఉన్న భూమి

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 4: మండల కేంద్రమైన సిర్గాపూర్ శివారులో ఈనాం భూమిని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు ఆక్రమించుకున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. సర్వే నంబరు 148లోని రెండు ఎకరాల 17 గుంటల ప్రభుత్వ ఈనాం భూమిని గత ప్రభుత్వ హయాంలో ఆ నాయకుడు ఆక్రమించుకున్నట్లు తెలిపారు. సిర్గాపూర్‌కు చెందిన గ్రామ సేవకుల కుటుంబాలకు ప్రభుత్వం ఈ భూమిని సాగు చేసుకుని జీవించాలని కేటాయించగా.. ఈ భూమిని వారు మరొకరికి విక్రయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి పట్టా కాదని తెలిసినా నామమాత్రపు ధర చెల్లించి ఆ వ్యక్తి వారి నుంచి భూమిని తీసుకున్నాడు. అనంతరం ఆ వ్యక్తి వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి కబ్జాచేసినట్లు ఆరోపిస్తున్నారు. భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని, భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సిర్గాపూర్ తహసీల్దార్ వివరణ కోరగా.. 148 సర్వే నంబరులోని భూమి ప్రభుత్వ భూమి అని, ఈనాం భూమిగా రికార్డుల్లో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ భూమి విక్రయించడం నేరమని, ఎవరైనా కబ్జాచేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వివాహ వేడుకల్లో మంత్రి దామోదర్



వివాహ వేడుకల్లో పాల్గొన్న దామోదర్ రాజనర్సింహ

రేగోడు, ఏప్రిల్ 4: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం రేగోడు మండలంలోని గజవాడ గ్రామంలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా రేగోడులో జరిగిన పట్లోళ్ల మహేష్ శిరీషల వివాహానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు.

గొర్రెల మంద పైకి దూసుకెళ్లిన లారీ

● పది గొర్రెలు మృత్యువాత



మృతిచెందిన గొర్రెలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4: చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి శివారు మెదక్ చేగుంట రహదారిపై వెళ్తున్న గొర్రెల మంద పైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో పది గొర్రెలు మృత్యువాతపడగా.. మరికొన్ని గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. హవేళీఘణపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన గొర్రెలకాపరులు కోరంకొల్ల శిర్షయ్య కొన్నిరోజుల క్రితం గొర్రెల మందను మేత కోసం గజ్వేల్ అటవీ ప్రాంతాలకు తీసుకెళ్లారు. గురువారం ఉదయం తిరిగి స్వగ్రామానికి తీసుకెళ్తున్న క్రమంలో మెదక్ వైపు వెళ్తున్న లారీ గొర్రెల మంద పైకి దూసుకెళ్లడంతో పది గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గొర్రెలకాపరులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటనలో దాదాపు రూ.లక్షన్నర నష్టం వాటిల్లినట్లు బాధితుడు శిర్షయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్ట పరిహారంతో పాటు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరాడు.

రెండు గడ్డివాములు దగ్ధం

టేక్మాల్, ఏప్రిల్ 4: ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన టేక్మాల్ మండలం తంపులూర్ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన జక్కుల రమేష్, జక్కుల అంజయ్యలకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గ్రామస్థులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో 200ల గడ్డి మోపులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

మళ్లీ మొదటికే చెన్నాయిపల్లి రైతుల కష్టాలు

● పొలాలకు నీరు చేరకుండానే అడ్డుపడ్డ శాలిపేట రైతులు



శాలిపేట చెరువు నుంచి నీటి కాలువను చదును చేస్తున్న చెన్నాయిపల్లి రైతు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4: చిన్నశంకరంపేట మండలం చెన్నాయిపల్లి గ్రామ రైతులకు చెరువు పారకం నీళ్ల విషయంలో తిప్పలు తప్పడం లేదు. శాలిపేట నల్లచెరువు నుంచి నీటిని విడుదల చేయాలని కొన్నిరోజుల నుంచి చెన్నాయిపల్లి గ్రామస్థులు కోరగా.. విడుదల చేశారు. అయితే కాలువ నుంచి నీరు పంట పొలాలకు చేరకముందే శాలిపేట రైతులు అడ్డు తగులుతున్నారని చెన్నాయిపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాలువను చదును చేసినా నీరు మాత్రం పొలాలకు చేరడం లేదు. రెండు తడులు పారితే గట్టెక్కొచ్చన్న రైతులకు నిరాశే మిగిలింది. అధికారులు ఎంత కృషిచేసినా ఫలితం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. ఇకనైనా రైతన్నల గోసలను పట్టించుకుని పంటలకు నీరు అందించే విధంగా కృషి చేయాలని వేడుకుంటున్నారు.

మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

● బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



పటాన్‌చెరు మైత్రీ మినీ స్టేడియంలో వాకర్స్‌తో ముచ్చటిస్తున్న రఘునందన్‌రావు

పటాన్‌చెరు, ఏప్రిల్ 4: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమైందని, అఖండమైన మెజార్టీతో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీమైదానం, బ్లాక్ కార్యాలయంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులను, యువత, కార్మికులు, మహిళలు, చిరువ్యాపారులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రాంతంతో తనకు ఉన్న అనుబంధం విడదీయలేనిదన్నారు. ఉపాధ్యాయుడిగా, పాత్రికేయుడిగా, న్యాయవాదిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ఈ ప్రాంతంలో తనకు ఉన్న రుణానుబంధం ఆజన్మాంతం విస్మరించలేనిదని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ఈ ప్రాంత సమస్యలకు శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బైండ్ల కుమార్, రవివర్మ, శ్రీనివాస్‌గుప్తా, నరేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమం మద్యం పట్టివేత

చేగుంట, ఏప్రిల్ 4: చేగుంట గ్రామ శివారులోని వెంకటేశ్వర పరిశ్రమ సమీపంలో గల రాజేందర్‌గౌడ్ కిరాణంలో అనుమతి లేకుండా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నామని చేగుంట ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. దాని విలువ రూ.10 వేలు ఉంటుందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 4: సంగారెడ్డి పట్టణంలోని ముస్లింలకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని నేషనల్ మార్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విందుకు పట్టణానికి చెందిన వందలాది మంది ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, కౌన్సిలర్లు అశ్విన్, విష్ణు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 4: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన గురువారం ప్రారంభమైంది. తొలిరోజు హోమం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, సీతారామావుదేశ్‌పాండే పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



వట్‌పల్లి: కేరూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సీసీ జనార్దన్

వట్‌పల్లి, ఏప్రిల్ 4: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని ఐకేపీ సీసీ జనార్దన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కేరూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు.

●నర్సాపూర్: నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, కాజీపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ గౌరీశంకర్ గురువారం ప్రారంభించారు.

నల్ల కుసుమల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మనూరు, ఏప్రిల్ 4: రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనూరు ఏవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన మనూరులో నాఫెడ్ వారి సౌజన్యంతో, మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో నల్ల కుసుమల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నల్ల కుసుమలు క్వింటాల్‌కు రూ.6,760 ఇస్తున్నదని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సంగమేశ్వర్, ప్రవీణ్‌కుమార్, రైతులు సిద్దారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ అభివృద్ధికి రూ.76 లక్షలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 4: అల్లాదుర్గంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థుల వసతుల కోసం ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.76 లక్షలు మంజూరు చేసినట్లు ఏఈ మల్లప్ప తెలిపారు. గురువారం విద్యాలయం వద్ద ప్రహరీ, నీటి వసతి కోసం సంపు పనులను ప్రారంభించి మాట్లాడారు. వసతి గృహంలో నిలిచిపోయిన పలు పనుల కోసం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ వల్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో స్రవంతి, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి, నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

'విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయి'

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 4: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన రాజశ్రీ ఉద్యోగ విరమణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలిని ఎంపీపీతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జాగృతి జిల్లా అధ్యక్షుడు

నారాయణఖేడ్, ఏప్రిల్ 4: సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్ గ్రామానికి చెందిన తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శేరికార్ అరుణ్‌రాజ్ గురువారం ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీబీపాటిల్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అరుణ్‌రాజ్ మాట్లాడుతూ మోదీ పాలన చూసి బీజేపీలో చేరారని తెలిపారు. ఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రికి అద్దె చెల్లించేలా చర్యలు చేపట్టాలి

జహీరాబాద్, ఏప్రిల్ 4: జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ(ఆస్పత్రి)కి సంబంధించి రెండేళ్ల నుంచి సుమారు రూ.3 లక్షల మేర అద్దె చెల్లించకపోవడంతో యజమాని తాళం వేశాడని, అద్దె డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ అన్నారు. ఈ విషయమై గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు.

తూప్రాన్ వీఆర్‌ఏ మృతి

తూప్రాన్, ఏప్రిల్ 4: తూప్రాన్ పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఏ నీరుడి నారాయణ ఆకస్మికంగా మృతిచెందాడు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తూప్రాన్‌కు విచ్చేశాడు. నారాయణ కుటుంబీకులను పరామర్శించారు. నారాయణ తూప్రాన్ 2వ వార్డు కౌన్సిలర్ వెంకటేష్ తండ్రి. వంటేరు వెంట మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నేడు సత్యాగ్రహ దీక్ష

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 4: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల హామీలు అమలుకోసం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రాందాస్ చౌరస్తాలో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4: బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి పోచారం రాములుపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకుగాను గతంలో రాములును పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ నాయకత్వానికి వివరణ ఇచ్చుకోవడంతో రాష్ట్ర పార్టీ సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి క్రమశిక్షణారాహిత్య సంఘటనలకు పాల్పడకుండా చూసుకోవాలని రాములును ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచించింది.

సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు



రైతుల వేషధారణలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్, ఏప్రిల్ 4: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. మూడునెలలుగా హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో గల కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థులు క్షేత్ర సందర్శన, స్థానిక వ్యవసాయ సాగుతీరుపై అవగాహన కల్పించుకునేందుకు జహీరాబాద్‌కు వచ్చారు. గురువారం వారి శిక్షణ పూర్తికావడంతో రంజోల్ గ్రామంలో గల రైతువేదికలో రైతులు, అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వరప్రసాద్, సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నితీష్, ఉద్యాన శాఖ అధికారి శైలజ, వ్యవసాయశాఖ విస్తీర్ణాధికారి ప్రదీప్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనార్థమైవచ్చి రైతులతో, అధికారులతో పంచుకున్న అనుభవాలను గుర్తుచేసుకున్నారు. రంజోల్, చిన్నహైదరాబాద్ గ్రామాల్లో విద్యార్థులు రైతులతో మమేకమై పంటల సాగు తదితరాలను ఒంట బట్టించుకున్న విషయాలు వారికి భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అందులో భాగంగా వ్యవసాయ సాగు పనితీరు, వర్మీ కంపోస్టు తయారీ, పాంపాడ్, పాలీహౌజ్ నిర్మాణం తదితర అంశాలపై విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.